# సృష్టి సూత్రం

కాకాని కమల

ట్రింగ్... ట్రింగ్... అంటూ డోర్ బెల్ మ్రోగింది.

విశ్రాంతిగా కూర్చుని టీవీ చూస్తున్న జయశ్రీ లేచి వెళ్ళి తలుపు తెరిచింది.

ఎదురుగా పచారి షాపు పనివాడు సాంబయ్య నిల్చుని ఉన్నాడు.

"నువ్వా! ఏంటి సాంబయ్యా" అన్నది.

"మిమ్మల్ని వెంటనే మా షాపు యజమాని సత్యనారాయణగారు పిల్చుకు రమ్మన్నారమ్మా" అన్నాడు.

జయశ్రీ నొసలు ముడుచుకుంది.

"ఎందుకు సాంబయ్యా" అంది.

"ఏమోనమ్మా



తెలియదు. దగ్గరుండి పిల్చుకురమ్మన్నారు. అర్జంటట" అన్నాడు.

"ఇప్పుడే రమ్మన్నారా?"

"అవునమ్మా"

"అలాగా ఉండు" అంటూ లోపలికి వచ్చింది. క్షణంలో ఆమె మనసంతా ఆందోళనగా అయ్యింది. సత్యనారాయణ పెద్ద గ్రాసరీ షాపు ఓనర్. ఆయన బాగా తెలిసినవాడు. సరుకులన్నీ ఐదారేళ్ళగా అక్కడే కొంటున్నాను. డబ్బు ఏవన్నా బాకీయా అంటే అదీ గాదు. ఏ నెలకానెల డబ్బిచ్చే సరుకులు కొంటుంది జయశ్రీ. జయశ్రీ భర్త మంచి ఉద్యోగి. వెనక అంతో ఇంతో ఉన్నవాళ్లు. పైగా జయశ్రీ అందరితో కలుపుగోలుగా ఉంటుంది. మంచి గృహిణిగా పేరు. అందరూ ఆమెని గౌరవిస్తారు. పన్నెండేళ్ళ కొడుకు మున్నా. వాడిని మంచి ఉన్నత విలువలుగా పెంచుతోంది. మంచి కాన్వెంటులో వేశారు. బిడ్డని బాగా పెంచుతూ శ్రద్ధ తీసుకుంటోంది. సాయంత్రం ట్యూషన్‌కి వెడతాడు. ఉన్న ఒక్క కొడుకుని మంచి పౌరుడిగా చెయ్యాలన్నదే ఆమె ఆశయం. అలాగే పెంచుతోంది కూడా. ఏ సమస్యలు లేవు. ఎన్నడూ లేంది ఆ షాపు యజమాని తమ కుటుంబ మిత్రుడు ఇంత సడన్‌గా తనని ఎందుకు దగ్గరుండి తీసుకురమ్మని మనిషిని పంపాడు. ఆమె పేరు చెప్పి ఎవరన్నా సరుకులు తీసుకున్నారా?" ఆలోచన్ల మధ్య తలుపుకి తాళం వేసి సాంబయ్య వెంట బయలుదేరింది.

ఉత్సుకత ఆగక "ఎందుకు సాంబయ్యా?" అంది.

"ఏమోనమ్మా నాకు తెలియదు" అన్నాడు సాంబయ్య.

దుకాణం దగ్గరే మూడు నిమిషాల నడక. ఆ చుట్టుపక్కల అన్నింటిలో సత్యనారాయణదే పెద్ద గ్రాసరీ షాపు. ఫాన్సీ మెడికల్ సెక్షన్స్ కూడా ఉన్నాయి. ఒక చిన్న సూపర్ మార్కెట్టుకి వెళ్లినట్లు షాపింగ్ అంతా పూర్తి చేసుకోవచ్చు. ఓనరు మంచివాడు. పైగా కల్తీ లేని మంచి సరుకు అమ్ముతాడు.

జయశ్రీ వెళ్ళేసరికి సత్యనారాయణ ఆమె కోసమే ఎదురుచూస్తున్నాడు.

జయశ్రీ వేగంగా కొట్టుకునే గుండెతో ఆందోళనగా షాపులో అడుగుపెట్టింది.

తమపేరు చెప్పి ఎవరన్నా డబ్బో, సరుకులో తీసుకుని ఉంటారు అనుకుంటూ- "హలో సత్యంగారూ ఏం జరిగింది? నన్ను రమ్మన్నారు. మీరేదన్నా సమస్యలో పడ్డారా?" అంది చిరునవ్వుతో.

కాని ఆయన నవ్వలేదు.

"కాదు మేడమ్. మీరే ఒక పెద్ద సమస్యని ఎదుర్కోపోతున్నారు" అన్నాడు.




"ఉగాది స్పెషలేం చేస్తున్నావే బంగారూ?" తలస్నానం చేసొచ్చి, తీవీగా టీవీ ముందు కూర్చుంటూ అన్నాడు రాంబాబు.

"ఏం వుందీ! వేప్పువ్వు పచ్చడి, వేపాకు కూర, వేపకాడల పులుసు, వేపకాయల వేపుడు..." చెప్పసాగింది బంగారం. - కె. ఎన్నార్ నమ్మి

"ఆ....... ఏమైంది? ఏంటి సంగతి చెప్పండి" అని తొందరచేస్తూ ఆందోళనగా ప్రశ్నించింది. ఆమె కంఠం ఆ పాటికే బలహీనంగా అయ్యింది.

సత్యనారాయణ కొంచెంసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

అప్పుడు మెరుపులా ఆమె కంటికి ఒక దృశ్యం కనిపించింది. అంతవరకూ ఆమె గమనించలేదు. ఒక మూలగా కళ్ళ నీళ్ళతో 12 ఏళ్ళ కొడుకు మున్నా నిల్చుని ఉన్నాడు. మనిషి తుఫానులో ఆకులా ఒణికిపోతున్నాడు. ధారగా కన్నీళ్ళు కారుస్తున్నాడు.

కేక పెడుతున్నట్లు అంది జయశ్రీ - "మున్నా! ఏమయ్యిందిరా నీకు? ఇక్కడెందుకున్నావు. ఎందుకేడుస్తున్నావ్. నువ్వు ట్యూషన్‌కి వెళ్ళావు కదా? ఇక్కడికెందుకు వచ్చావ్? ఎందుకురా అలా భయంగా చూస్తున్నావ్?" గబాలున వెళ్ళి బిడ్డని కౌగలించుకుంది. తను ఏదో గండంలో పడింది. ఏదో కష్టం వచ్చింది అనిపించింది. బిడ్డని అరచేతుల్తో ఒళ్ళంతా తడుముతూ "ఏం జరిగిందిరా చెప్పు" అంది గద్దిస్తున్నట్లు. కాని ఆ గద్దింపులో కోపం లేదు. ఆందోళన ఉంది. గొంతుదాకా ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ఉత్సుకత.

"నేను చెప్తాను మేడమ్. మీ కొడుకు మున్నా దొంగ" అన్నాడు సత్యనారాయణ గంభీరంగా - ఆ గొంతులో కొద్దిపాటి కాఠిన్యం.

జయశ్రీ వెర్రి కేక పెట్టింది. షాక్ తగిలినట్లు ఒణికిపోతోంది. స్పృహ తప్పుతుందేమో అన్నట్లు కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి.

నా కొడుకు బుద్ధిమంతుడు, మంచి పేరున్న స్కూల్లో చదువుకుంటున్నాడు. పెద్ద ఇన్స్టిట్యూట్‌లో ట్యూషన్‌కి పంపుతున్నాను. వాడు గొప్పవాడై నా ఆశలు తీరుస్తాడు. మాకు పేరు తెచ్చి పెడతాడు. ఒక్క కొడుకైనా మా వంశాభివృద్ధికి వాడే అండ" అని మురిసిపోతోంది. కొడుకు తెలివితేటలు గురించి అందరికి ఘనంగా చెప్తుంది. అలాంటి తన అల్లారుముద్దుల బిడ్డ గారాల పట్టి మున్నా దొంగా" కేక పెట్టింది.

"అవును మేడమ్. కొద్ది రోజులుగా మీ కొడుకు మా కొట్లో దొంగతనానికి అలవాటు పడ్డాడు. తరచూ పెన్సిలో రబ్బరో కొంటానికని వస్తున్నాడు. మేం చూడకుండా చాక్‌లెట్లు, కేకులు, పళ్ల తన బ్యాగులో వేసుకుంటున్నాడు. మా షాపులో గత కొన్ని దినాలుగా వస్తువులు పోవటం మేం గమనించాం. కాని మీ అబ్బాయి అనుకోలేదు. చాలామంది మా షాపుకి వస్తారు. వాళ్ళల్లో ఎవరో అనుకున్నాం. మీ అబ్బాయికి అలాంటి బుద్ధి ఉంటుందని గాని అంత అవసరం ఉంది అని గాని మేం ఊహించలేదు. ఎందుకంటే మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ మాకు తెలుసు. మీది గౌరవ కుటుంబం. మీ వారు ఆఫీసరు. మీరు చాలా మర్యాదస్తులు. అందుకే మేం మీ కొడుకు గురించి కనీసంగా అనుకోలేదు. వేరే ఎవరో ఈ పని పెద్దలే చాకచక్యంగా చేస్తున్నారు అనుకున్నాం. కాని ఈ రోజు మీ కొడుకు దొంగతనం చేస్తుంటే నేనే పట్టుకున్నాను"

"ఆ... ఎ.........లా .... ఎ...... లా?" జయశ్రీ బలహీనంగా చూసింది.

బాల్‌పెన్ కావాలని అడిగాడు. ఈ బల్ల మీది స్టాండ్‌లో స్టాక్ అయిపోవడంతో నేను కొత్త ప్యాకెట్టు కోసం లోపలికి వెళ్ళాను. షాపులో మా పనివాళ్ళు స్టాక్ వస్తే వాటిని లారీనుంచి దింపి గొడౌన్‌లో పెట్టిస్తూ బిజీగా ఉన్నారు. అందుకని నేనే కౌంటర్‌లోంచి లేచి లోనికి వెళ్ళాను. అప్పుడు మీ కొడుకు నా క్యాష్ సొరుగు లాగి నోట్లని చేతినిండా బయటికి తీశాడు. లక్కీగా ఎదురుగా ఉన్న అద్దంలోంచి నాకు లోపలికి కనిపించింది. అంతే. వెంటనే వచ్చి వాడి చేతిని పట్టుకున్నాను.

ఒక విధంగా మీరు అదృష్టవంతులు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేరు. కష్టమర్సు లేరు.

నా వర్కర్సు అందరూ స్టాకుని గొడౌన్‌లో పెట్టడంలో బిజీగా ఉన్నారు" అన్నాడు.

కాని జయశ్రీకి తెలుసు. ఈ విషయం ఎంత తొందరగా తెలిసిపోతుందో. క్షణంలో ఆ సేట్ ముందు ఆమె తల వంగిపోయింది. ఆమె ఆత్మగౌరవం, గర్వం అన్నీ ఆ క్షణంలో మురికి కాలువలోకి పోయినట్లయ్యింది. గర్వం కోల్పోయిన మహారాణిలా ఉంది ఆమె పరిస్థితి. "ముందు మీ మున్నాని పోలీసులకి అప్పగిద్దాం అనుకున్నాను. కాని మీరు చాలా కాలంగా నాకు తెలుసు. మా షాపు కస్టమరు. పైగా మంచి గౌరవప్రదమైన కుటుంబం మీది. అందుకే వ్యక్తిగతంగానే ఈ విషయం మీకు చెప్పాలని నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం మీ మున్నా డబ్బు తీసినా నష్టం అంటూ నాకేం జరగలేదు. నేను వాణ్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాను కనక. మీరు మీ అబ్బాయి విషయంలో ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే కష్టం. అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను" అన్నాడు మున్నా తల్లికేసి నేరుగా చూశాడు.

జయశ్రీ ముఖం తెల్లగా పాలిపోయింది. ఆమె కళ్ళల్లో కాంతి పోయింది.

సత్యనారాయణ అన్నాడు "మేడమ్ క్షమించండి. మిమ్మల్ని బాధపెట్టాలని కాదు. కాని పరిస్థితి మీకు చెప్పటం మంచిదనిపించింది. లేకపోతే నాకంటే మీరే ఎక్కువ నష్టపోతే...."

"లేదు. మీమీద నాకు కోపం లేదు. చాలా మేలు చేశారు. పోలీసులకి తెలిస్తే ఏమయ్యేది." అంది. ఆమె కళ్లు ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి. మనసు మూగగా రోదిస్తోంది. ఏ క్షణంలో అయినా ఊపిరి ఆగిపోతుంది అన్నంత టెన్షన్‌గా ఉంది.

"మీ మున్నా దొంగ, పోలీసులకి పట్టి ఇద్దామనుకున్నాను" సత్యనారాయణ మాటలు చెవుల్లో డప్పు కొట్టినట్లు మోగుతున్నాయి.

వెనక్కి తిరిగి వేగంగా షాపులోంచి బయటకి వచ్చింది. తల్లిని మౌనంగా అనుసరించాడు మున్నా. నీళ్ళు నిండిన కళ్ళు మసక బారుతుంటే చూపు ఆనక షాపు మెట్లు దిగుతూ తూలిపడబోయింది. మున్నా గభాల్న తల్లి చేతిని పట్టుకొని పడకుండా ఆపాడు. జయ కళ్ళెత్తి కొడుకుకేసి చూసింది.

ఆ చూపులో ఎన్నో అర్థాలు. తల్లికి తనకి మధ్య వేల మైళ్ళ దూరం... ఛట్కున తల్లి చేతిని వదిలాడు.

ఆ చూపు ఎందుకో భీతి గొలిపింది మున్నాని.

జయశ్రీ ఒక్కసారి కళ్ళు గట్టిగా మూసుకొని తలని పక్కకి తిప్పుకుంది. తల్లి ఆ నిరసన నోరు విప్పి మాటల్లో చెప్పలేని ఎన్నో భావాలని విప్పి చెప్పింది చిన్నారి మున్నాకి. తల్లి ముఖంలో జీవం లేదు. పాలిపోయి ఉంది. ఎంతో ముసలిదానిలా నిస్సత్తువగా అనిపించింది. షాపుకి వచ్చినపుడు తల్లికి - తిరిగి వెళుతున్నప్పుడుకి ఎంతో తేడా కనిపించింది.




దిగులుగా ఉన్న సుబ్బారావుని అడిగాడు అప్పారావు.

"ఈ ఉగాదికి మీ మామగారు ఏం పంపారా?"

"బస్తాడు వేప్పువ్వు పంపి, దాంతో పచ్చడి వ్యాపారం చేయమన్నార్రా!" చెప్పాడు సుబ్బారావు.

- కె. ఎన్నార్ నమ్మి

✻ ✻ ✻

తల్లి అంతగా. కృంగిపోవడం ఇంతవరకు మున్నా ఎన్నడూ చూడలేదు. ఆఖరికి మున్నా క్వార్టర్లీ పరీక్షల్లో అన్ని సబ్జెక్ట్సులో ఫేలయినప్పుడు కూడా ఇంతగా కృంగి పోలేదు. కాని ఇప్పుడు పూర్తిగా కొత్తగా అనిపించింది. మున్నాకి అర్థం అయ్యింది. ఏదో వేదన కలిగించింది. తల్లి నిధిని తను నాశనం చేసినట్లు అర్థం అయ్యింది ఆ చిన్న మనస్సుకి.

"అమ్మ ఏమనుకుంటుంది? నేనెందుకిలా చేశానని అనుకుంటుంది? ఇంటికెళ్ళాక తనకి ఎలాంటి శిక్ష విధిస్తుంది. బాగా కొడుతుందా? లేక నాన్న ఇంటికి రాగానే చెప్తుందా? అసలు ఇక ముందు అమ్మ తనతో మాట్లాడుతుందా? ఇంటికి రాగానే తలుపు తీస్తూనే జయశ్రీ దబ్బున కిందపడిపోయింది. అంతవరకు ఎలాగో శవాన్ని ఈడ్చినట్టు నడుస్తూ ఇంటికి వచ్చింది. కాని ఆమెలో శక్తి నశించిపోయింది. ఇంట్లోకి వస్తూనే కుప్పకూలిపోయింది. ఆమె గోళ్ళనుంచి రక్తం వస్తోంది. పళ్లు నొక్కి పెట్టడంతో పెదవులు రక్తం చుక్కలు చిమ్ముతున్నాయి. కళ్ళు మూతలు పడ్డాయి. జయశ్రీ స్పృహ తప్పి కింద పడిపోయింది.

తల్లి గోళ్ళ నుంచి పెదాలనుంచి వస్తున్న రక్తం చూస్తూనే మున్నా "అమ్మా" అంటూ గట్టిగా కేక పెడుతూ తల్లి మీద వాలిపోయాడు. "అమ్మా, అమ్మా" అంటూ తల్లిని కదిలించాడు. గభాల్న లేచి గ్లాసుతో నీళ్ళు తెచ్చి తల్లి ముఖం మీద చల్లాడు. తన చిన్ని అరచేతుల్తో తల్లి అరికాళ్ళని గట్టిగా రుద్ది వేడి పుట్టించసాగాడు.

జయకి మెలకువ వచ్చింది. శక్తి వచ్చింది. గభాల్న "మైక్రోవేవ్" లోంచి ఓవెన్ తీసింది. అందులోంచి చక్కగా బేక్ చేసిన "చాక్‌లెట్ కేక్" మున్నాకి చాలా చాలా ఇష్టం అయిన చాక్‌లెట్ కేక్... దాన్ని తీసి నేలకి విసిరికొట్టింది జయశ్రీ.

"ధబ్బు" మన్న శబ్దం గదిలో మారుమ్రోగింది.

ఆ కింద పడ్డ కేక్‌ని చూస్తూనే మున్నాకి గుర్తు వచ్చింది.

ఆ రోజు తల్లి పుట్టిన రోజు. అయినా మున్నాకి ఇష్టమైన చాక్‌లెట్ కేక్ తయారుచేసింది". కాని...

తనేం బహుమతి ఇచ్చాడు తల్లికి? అమ్మ పుట్టినరోజు అయినా తనకి ఇష్టం అయిన చాక్‌లెట్ కేక్ తయారుచేసిన అమ్మకి తనేం కానుక ఇచ్చాడు!

"అమ్మా....." దుఃఖం ఉప్పెనలా పొంగుతుంటే పెద్ద ఆర్తనాదం చేశాడు మున్నా. సర్వం మరచి గభాల్న తన రెండు చేతుల్తో తల్లిని కౌగలించుకున్నాడు. మున్నా కాళ్లు బాగా పొడవు. తల్లి ఎత్తుకి సమంగా ఉంటాడు, రెండు చేతుల్తో తల్లిని కౌగలించుకుని కన్నీరు కారుస్తూ తల్లి భుజాల మీద తల పెట్టుకొని "అమ్మా.... నన్ను క్షమించు.. సారీ... ఇంకెప్పుడూ ఇలా చెయ్యను" అని ఏడుస్తున్నాడు. వాడి లేత చేతులు తల్లిని గట్టిగా పట్టుకొన్నాయి.

చిత్రంగా జయశ్రీ కోపం చల్లారిపోయింది. అంతవరకూ ఎర్రగా నిప్పులు రాల్చిన ఆమె కళ్ళు మల్లెపువ్వుల్లా అయ్యాయి. అగ్గిలా రాజుతున్న మనసు మంచు పర్వతం అయ్యింది. గభాల్న కొడుకుని రెండు చేతుల్తో గుండెకి అదుముకుంది. వాడి నుదుటపైన చెంపలపై అందిన చోటల్లా ముద్దులు కురిపించసాగింది. ఆమె చేతులు మున్నాని నిలువెల్లా ఆపేక్షగా తడుముతున్నాయి.

"మున్నా బంగారు కొండ. వాడు తెలియక తప్పులు చేశాడు. ఇక ముందెన్నడూ ఇలా చెయ్యడు. వాడు వరాల మూట, బంగారు తండ్రి. మున్నా నా కొడుకు" బిడ్డపై జయశ్రీ కళ్ళు ముత్యాలు రాలుస్తున్నాయి.

ఇద్దరి చేతులు ఒకర్ని ఇంకొకరు బంధిస్తున్నాయి. ఇరువురి మనసులు ప్రేమామృతాన్ని గ్రోలుతున్నాయి. యావత్ సృష్టి సూత్రం అదే కదా? ❁